## ఉల్లి ఎగుమతులపై నిషేధం పొడిగింపు

న్యూఢిల్లీ, మార్చి 23: ఉల్లిగడ్డల ఎగుమతులపై విధించిన నిషేధాన్ని కేంద్రం పొడిగించింది. దేశీయంగా ఉల్లిగడ్డల లభ్యత పెంచేందుకు, ధరలు అదుపులో ఉంచే లక్ష్యంతో తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు ఈ నిషేధం కొనసాగుతుందని కేంద్రం తెలిపింది. వాస్తవానికి ఉల్లిగడ్డల ఎగుమతిపై విధించిన నిషేధం ఈ ఏడాది మార్చి 31తో ముగుస్తుంది. దీంతో శుక్రవారం డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్ (డీజీఎఫ్టీ) ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. తదుపరి ఉత్తర్వులు వెలువడేంత వరకు ఎగుమతులపై నిషేధం కొనసాగుతుందని తెలిపింది.

## వేర్వేరు మతస్థుల భూముల లావాదేవీలపై నిషేధం!

### అస్సాం ప్రభుత్వం కీలక నిర్ణయం

గువాహటి, మార్చి 23: భూముల అమ్మకాలు, కొనుగోళ్లకు సంబంధించి అస్సాంలోని బీజేపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వేర్వేరు మతస్థుల భూముల క్రయవిక్రయాలు జరగకుండా తాత్కాలిక నిషేధం విధించింది. లోక్‌సభ ఎన్నికల వేళ మతపరమైన ఘర్షణలు జరగకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్టు అస్సాం ప్రభుత్వం ప్రకటించింది. వేర్వేరు మతాలవారు ఒకరికి ఒకరు భూములను విక్రయించడానికి ఇవ్వాల్సిన నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్(ఎన్వోసీ)ని మూడు నెలల పాటు ఇవ్వవద్దని రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు.

## 'శివరాజ్‌కుమార్ సినిమాలను నిషేధించండి'

బెంగళూరు: ప్రముఖ కన్నడ నటుడు శివరాజ్‌కుమార్ నటించిన సినిమాలు, ప్రకటనలను ఎన్నికల ప్రవర్తన నియమావళి ముగిసే వరకు నిషేధం విధించాలని బీజేపీ కర్ణాటక శాఖ ఎన్నికల కమిషన్‌ను కోరింది. శివరాజ్ భార్య గీత కాంగ్రెస్ అభ్యర్థిగా శివమొగ్గ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. శివరాజ్ కుమార్ రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ తరపున ప్రచారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ ఈ డిమాండ్ చేసింది. ఓటర్ల జాబితా నుంచి పేర్లను విచక్షణారహితంగా తొలగించడంపై చర్యలు తీసుకోవాలని కూడా బీజేపీ కోరింది.

# యూపీలో తెలుగు బిడ్డ జోర్దార్!

- నాలుగు నెలల్లో 50 వేల ఫిర్యాదుల పరిష్కారం
- ఆంధ్రాకు చెందిన కలెక్టర్ వంశీ రూటే సపరేటు
- డెడ్‌లైన్లతో ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలకు చెక్

కఠినమైన అధికారిగా, స్పాట్ డెసిషన్ మేకర్‌గా ఐఏఎస్ ఆంద్ర వంశీకి పేరున్నది. ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలుకు చెందిన ఆంద్ర వంశీ 2006లో హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ నుంచి కంప్యూటర్ సైన్స్‌లో బీఏ పూర్తి చేశారు. తర్వాత యాక్సెంచర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేశారు. 2008లో ఆదాయపు పన్ను శాఖలో అసిస్టెంట్ కమిషనర్‌గా ఉద్యోగం సాధించారు. చిన్నప్పటి నుంచి చదువులో రాణించే ఆయన దేశం కోసం ఏదైనా చేయాలనుకున్నారు. ఐఏఎస్ కావడం ద్వారా దోపిడీకి గురైన, అణగారిన వర్గాల, పేదల గొంతుకగా నిలవాలన్నది ఆయన కల. 2011లో యూపీఎస్సీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఐఏఎస్ అయ్యారు. తరువాత మథుర, ప్రయాగ్‌రాజ్, ఝాన్సీ, ఫిలిబిత్, షాజహాన్‌పూర్ తదితర జిల్లాల్లో కలెక్టర్‌గా సేవలందించారు. లక్నోలో స్కిల్ డెవలప్‌మెంట్ మిషన్ డైరెక్టర్‌గా పనిచేస్తుండగా ఆయనకు యూపీలోని బస్తీ జిల్లా పగ్గాలు అప్పగిస్తున్నట్లు ఆదేశాలు వచ్చాయి. బస్తీ డీఎంగా బాధ్యతలు తీసుకొన్న తర్వాత ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రాధాన్యత ఇచ్చారు. అభివృద్ధి, రెవెన్యూ పనులు కూడా మరింత మెరుగ్గా జరగాలన్నారు.

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 23 (నమస్తే తెలంగాణ): అందరిలాగా ఏసీ గదుల్లో కూర్చొని.. తన దగ్గరికి సమస్యలతో వచ్చే వారికి ఏదో చెప్పి పంపించే రకం కాదు ఐఏఎస్ ఆంద్ర వంశీ. తన జిల్లాలో ఎవరు, ఏ సమస్యతో ఇబ్బంది పడుతున్నారో తెలుసుకొని.. వాళ్ల దగ్గరికి వెళ్లి మరీ పరిష్కరిస్తారు. అంతేకాదు.. కార్పొరేట్ కంపెనీల్లో 'ప్రాజెక్టులకు డెడ్‌లైన్లు' ఎలా విధిస్తారో.. ప్రతి ఫిర్యాదు పరిష్కారానికి కూడా ఆయన ఓ డెడ్‌లైన్ విధించుకొంటారు. నిర్ణీత సమయంలోపు సదరు సమస్యను ఎంతకష్టమైనా పరిష్కరిస్తారు. అలా బాధ్యతలు చేపట్టిన కేవలం నాలుగు నెలల్లోనే ఏకంగా 50 వేల పెండింగ్ ఫిర్యాదులను పరిష్కరించారు వంశీ. దీంతో ఈ కలెక్టర్ పనితీరుపై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తున్నది. 'మా మంచి కలెక్టర్ సారు' అంటూ జిల్లావాసులు కొనియాడుతున్నారు.

### ఏండ్లకేండ్లు పరిష్కారం కానివి చిటికెలో..

సర్కారు ఆఫీసులో పని పూర్తవ్వాలంటే 'ఏండ్లకేండ్లు సాగదీతే' అని నిట్టూర్చే ప్రజలకు.. ఇంటి వద్దకే అన్ని సేవలను క్షణాల్లో అందేలా వంశీ పటిష్ట చర్యలు తీసుకొన్నారు. ఉత్తరప్రదేశ్ బస్తీ జిల్లాలోని వందలాది గ్రామాల్లో దాదాపు 30 ఏండ్లుగా పరిష్కారంకాని 49,823 ఫిర్యాదులను(కేసులను) కేవలం నాలుగు నెలల్లోనే ఆయన శాశ్వతంగా పరిష్కరించారు. ఇందులో భూతగాదాలు, కబ్జాలు, బ్యాంకుల రుణాలు–చెల్లింపులు, నీటి పారుదలకు సంబంధించి ఎన్నో క్లిష్టమైన కేసులు కూడా ఉన్నాయి. గత సెప్టెంబర్‌లో బస్తీ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంటనే ప్రతి రోజూ కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్, సబ్ కలెక్టర్, తహశీల్దార్, గ్రామ పెద్దలతో సదస్సును నిర్వహిస్తున్న వంశీ.. అక్కడికక్కడే సమస్యలను పరిష్కరిస్తున్నారు. ఒకవేళ, అధికారులు ఎవరైనా సదస్సుకు హాజరుకాకపోతే, విధిగా ఫిర్యాదుదారు ఇంటికి వెళ్లి సదరు అధికారి ఆ రోజు సాయంత్రంలోగా సమస్యను పరిష్కరించాల్సి ఉంటుంది. ఇలా, రోజూ డెడ్‌లైన్ విధించుకొని కేసులను పరిష్కరించడం వల్లే దశాబ్దాలుగా ఎడతెగని ఎన్నో కేసులను 4 నెలల్లోనే పరిష్కరించగలిగినట్టు వంశీ పేర్కొన్నారు. దీనికి అధికారులు, గ్రామస్థులు ఎంతో సహకారం అందించినట్టు కొనియాడారు.



ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించి పరిశీలిస్తున్న బస్తీ జిల్లా కలెక్టర్ వంశీ (ఫైల్)

### ఆదుకున్న మా మంచి సారు

ఇంట్లో వృద్ధులు ఉండటంతో నెలకు రూ.20 వేల వరకు దవాఖాన ఖర్చులు అవుతున్నాయి. ఈ మధ్యే బిడ్డ పెండ్లి కి రూ.5 లక్షల వరకూ అప్పు అయ్యింది. అప్పు తీర్చడానికి భూమి అమ్మాలనుకొన్నాం. అయితే, దళితుల భూమి దళితులు మాత్రమే కొనుగోలు చేయాలని చట్టంలో ఉందట. అయితే, కలెక్టర్ సారు ప్రత్యేక చొరవతో మేం మా భూమిని ఎలాగోలా అమ్మేసి అప్పు తీర్చేశాం. వంశీ సారుకు ధన్యవాదాలు.

*-లక్ష్మీ యాదవ్, పల్వాగ్రామం, బస్తీ జిల్లా*

### నేను నమ్మేది అదే!



'జస్టిస్ డిలేడ్ ఇజ్ జస్టిస్ డినైడ్' అన్న మాటను నేను గట్టిగా నమ్ముతా. ఉదాహరణకు.. భూమి విషయంలో గొడవ చిన్న గా మొదలైనప్పుడే దాన్ని పరిష్కరించాలి. లేకపోతే, అది క్రమంగా పెద్దగా మారి నేరాలు జరుగడానికి కారణం కావొచ్చు. చిన్న చిన్న వివాదాలతో ఇక్కడి ప్రజలు అనవసరంగా తమ సమయాన్ని వృథా చేసుకుంటున్నారు. బాధ్యతలు చేపట్టగానే అక్టోబర్ 2023 నుంచి జనవరి 2024 మధ్య 49,823 కేసులను పరిష్కరించాం. దీంతో మమ్మల్ని ఆశ్రయించే బాధితుల సంఖ్య కూడా పెరిగింది. కొత్తగా 17,700 ఫిర్యాదులు నమోదవ్వడమే దీనికి నిదర్శనం. అధికారులు, గ్రామస్థుల సహకారం ఎంతో ఉన్నది.

*- వంశీ ఆంద్ర, బస్తీ జిల్లా కలెక్టర్, యూపీ*

## వస్తువుల పేర్లను కుక్కలు గుర్తు పడతాయి!

*న్యూఢిల్లీ:* వస్తువుల పేర్లను కుక్కలు గుర్తు పట్టగలవని యోట్వోస్ లోరాండ్ యూనివర్సిటీ బృందం గుర్తించింది. వేర్వేరు జాతులకు చెందిన 18 కుక్కలపై ఈ బృందం నిర్వహించిన అధ్యయనంలో ఈ ఆసక్తికర విషయం వెల్లడైంది. ఎలక్ట్రోఎన్సెఫలోగ్రఫీని ఉపయోగించి వాటి మెదడు తరంగాలను పరిశీలించింది. 'కూర్చో', 'తీసుకునిరా' వంటి పదాలను మాత్రమే కాకుండా మరికొన్ని పేర్లను, అవి ఏయే వస్తువులకు సంబంధించినవో కుక్కలు అర్థం చేసుకోగలుగుతాయని ఈ అధ్యయనంలో తెలిసింది.

## బీజేపీలోకి ఆరుగురు కాంగ్రెస్ రెబల్స్

- రాజీనామా చేసిన ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు కూడా
- హిమాచల్‌ప్రదేశ్‌లో ముదురుతున్న సంక్షోభం

న్యూఢిల్లీ : హిమాచల్ ప్రదేశ్‌లో రాజకీయ సంక్షోభం ముదురుతున్నది. ఆరుగురు కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యేలు శనివారం బీజేపీలో చేరారు. సుఖు నేతృత్వంలోని ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి స్తంభించిందని వారు ఆరోపించారు. కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ, వీరి చేరిక వల్ల బీజేపీ మరింత బలోపేతమవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్నారు.కాగా ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు శుక్రవారం తమ పదవులకు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. అయితే ఈ పరిణామాల వల్ల హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వానికి త్వరలో కష్టాలు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఉప ఎన్నికల్లో బీజేపీలో చేరిన ఈ తొమ్మిది మంది గెలుస్తారని, మరికొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఆకర్షించవచ్చునని, అనంతరం తానే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవచ్చునని బీజేపీ భావిస్తున్నట్లు తెలుస్తున్నది. రాష్ట్ర అసెంబ్లీలో ప్రస్తుతం మెజారిటీ మార్క్ 30 మంది ఎమ్మెల్యేలు. కాంగ్రెస్‌కు ప్రస్తుతం 33 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉంది.

## కల్తీ మద్యం తాగి 21 మంది మృతి

*చండీగఢ్: పంజాబ్‌లో కల్తీ మద్యం తాగి 21 మంది ప్రాణాలు కోల్పోయారు. సంగ్రూర్ జిల్లాలో పలు గ్రామాల్లో మద్యం తాగిన దాదాపు 40 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిని దవాఖానలకు తరలించగా 21 మంది మృతి చెందారు. 17 మంది చికిత్స పొందుతున్నారు. బాధితులంతా రోజువారీ కూలీలు. కాగా, ఈ ఘటనపై వెంటనే నివేదిక అందించాలని శనివారం పంజాబ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీని రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశించారు.మద్యంలో మిథనాల్ కలవడమే ఈ ఘటనకు కారణమని పోలీసులు తెలిపారు.*

## బాలరాముడి 'చిన్న' విగ్రహమిది



*బెంగళూరు: అయోధ్య బాల రాముడి విగ్రహాన్ని చెక్కిన శిల్పి అరుణ్ యోగి రాజ్ మరో బాల రాముడి విగ్రహాన్ని చెక్కారు. అచ్చం అయోధ్యలో కొలువుదీరిన రాముడి శిల్పాన్ని పోలి ఉండేలా, చిన్న సైజులో ఈ విగ్రహాన్ని తీర్చిదిద్దారు. ఇందుకు సంబంధించిన ఫొటోను అరుణ్ యోగిరాజ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఖాళీ సమయంలో ఈ చిన్న విగ్రహాన్ని చెక్కినట్టు అరుణ్ పేర్కొన్నారు.*

## బీజేపీ సెమినార్‌కు బలవంతంగా విద్యార్థులు

### ముంబైలోని ఠాకూర్ కాలేజీ నిర్వాకం

ముంబై, మార్చి 23: రాజకీయాలు, పార్టీలకు అతీతంగా వ్యవహరించాల్సిన ఒక విద్యా సంస్థ బలవంతంగా తన విద్యార్థులను బీజేపీ ఆధ్వర్యంలో జరిగే సెమినార్‌కు పంపిన ఘటన ముంబైలో చోటుచేసుకుంది. కేంద్ర మంత్రి పియూష్ గోయల్ కుమారుడు ధ్రువ్ గోయల్ ముంబై నార్త్‌లో పోటీ చేస్తున్నారు. ఆ నియోజకవర్గ పరిధిలోనే ఉన్న ఠాకూర్ కాలేజీ తన విద్యార్థులను ధ్రువ్ గోయల్ ఆధ్వర్యంలో జరిగే బీజేపీ సెమినార్‌కు బలవంతంగా పంపించింది. పరీక్షల వేళ తమ గుర్తింపు కార్డులను గుంజుకుని తమను ఈ సెమినార్‌కు పంపడం పట్ల పలువురు విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. ఏడో అంతస్తులో నిర్వహించిన ఈ సెమినార్ నుంచి బయటకు కూడా వెళ్లకుండా తమను అందులోనే ఉంచి లాక్ చేశారని వారు ఆరోపించారు. సెమినార్ అంతా ప్రధాన మంత్రి గొప్పతనం, బీజేపీ సాధించిన విజయాల గురించే సాగిందని వారు తెలిపారు. కాగా, శనివారం నుంచి విద్యార్థులకు పరీక్షలు ఉన్నమాటను అంగీకరించిన ప్రిన్సిపాల్, ఏ విద్యార్థిని కూడా ఫలానా పార్టీకి ఓటు వేయండని కోరలేదని చెప్పారు.

## 18వ రోజుకు చేరిన వాంగ్‌చుక్ దీక్ష

### లడఖ్ స్వయం ప్రతిపత్తి కోసం డిమాండ్



న్యూఢిల్లీ/శ్రీనగర్: హిమాలయ ప్రాంతమైన లడఖ్‌కు స్వయం ప్రతిపత్తి కోరుతూ ప్రముఖ పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరాహారదీక్ష శనివారం నాటికి 18వ రోజుకు చేరుకున్నది. ఇప్పటికే ఎంతో బలహీనంగా ఉన్నా, దీక్షను విరమించమని సన్నిహితులు కోరుతున్నా.. మరో మూడు రోజుల పాటు దీక్షను కొనసాగించాలని వాంగ్‌చుక్ నిర్ణయించుకున్నారు. ఆయన దీక్షకు వేలాది మంది నుంచి మద్దతు లభిస్తున్నది. పారిశ్రామికీకరణ వల్ల లడఖ్ ప్రాంతంలోని హిమానీనదాలకు తీవ్ర నష్టం వాటిల్లుతున్నదన్న అంశాన్ని వాంగ్‌చుక్ దీక్ష బలంగా బయటపెట్టింది. 21 రోజుల అనంతరం తాను దీక్ష విరమించినా.. తన మద్దతుదారులు వంతులవారీగా నిరాహారదీక్షను కొనసాగిస్తారని వాంగ్‌చుక్ తెలిపారు. అతడికి మద్దతు తెలపటానికి శనివారం ఒక్కరోజే లేహ్ నగరంలోని దీక్షా స్థలి దగ్గరికి సుమారు 2 వేల మంది ప్రజలు వచ్చారు. రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్‌లో గుర్తించిన రాష్ట్రాల జాబితాలో లడఖ్‌ను చేరుస్తామని 2019 జాతీయ ఎన్నికల సందర్భంగా మోదీ హామీ ఇచ్చారు. కానీ అదింకా నెరవేరలేదు. అంతర్జాతీయ మీడియాతో వాంగ్‌చుక్ మాట్లాడుతూ లడఖ్‌లో ప్రజాస్వామ్యం లేదని ఆరోపించారు. పారిశ్రామిక, మైనింగ్ ప్రయోజనాల నుంచి ఇక్కడి నేలను, అడవులను రక్షించే చట్టాలు చేయలేని స్థితి ఉందన్నారు.

